
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం 16 నవంబరు 2025

నవభారతాన్ని నిర్మించిన మహనీయుడు పటేల్

- అందరూ ఆయన బాటలో పయనించాలి
- కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో యూనిటీ మార్చ్‌ను ప్రారంభించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

7

జిల్లాలో ఇటుక బట్టీల వ్యాపారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. నిబంధలనకు పాతర వేస్తూ.. తమ ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒక్కో బట్టికి సంవత్సరానికి రూ.22 వేలు మైనింగ్ శాఖకు చెల్లించి అమ్మకాలు సాగించాల్సి ఉంటుంది. కానీ కొందరు ఇటుక బట్టీల నిర్వాహకులు ఒక్క బట్టి అనుమతికే ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి.. ఏకంగా పదికి పైనే బట్టీలను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అక్రమాల బట్టీలు!

- జిల్లాలో ఇటుక వ్యాపారుల ఇష్టారాజ్యం
- ఒక దానికి అనుమతి.. అమ్ముకునేది పది బట్టీల్లో
- చెట్లను నరికేస్తూ.. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- సిండికేట్‌గా మారి అధిక ధరకు విక్రయాలు
- గతంలో ట్రాక్టర్ రూ. 12 వేలు, ప్రస్తుతం ట్రాక్టర్ రూ. 20వేలు
- కనీస చర్యలు తీసుకోని అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు భూములను ఇటుక వ్యాపారులు సంవత్సరాల కొద్దీ రైతు వద్ద లీజు పేరుతో అగ్రిమెంట్లు తీసుకుంటున్నారు. ఆ తర్వాత చెరువు మట్టిని, కలపను అనుమతి లేకుండానే తీసుకొచ్చి బట్టీలలో నిల్వలు చేపడుతున్నా.. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత ఏడాది నుంచి మైదాన ప్రాంతాలలో కూడా వాల్టా చట్టం ప్రకారం ఇటుక బట్టీలకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ వాల్టా చట్టానికి విరుద్ధంగా అధికారులు అనుమతి ఇస్తూ పర్యావరణానికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తున్నారనే వాదనలు వినబడుతున్నాయి. అయినప్పటికీ అటవీ, రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పచ్చని చెట్లపై గొడలి వేటు పడుతున్నా.. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 35 ఇసుక బట్టీలు ఉన్నాయి. వీటిలో వైరా, తల్లాడ, ఖమ్మం రూరల్, అర్బన్, రఘునాథపాలెం, ముదిగొండ, తదితర మండలాల్లో అధికంగా వ్యాపారం సాగుతోంది. ఇవన్నీ ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్నాయి. వీటి నుంచి వచ్చే పొగ వల్ల వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాల్టా చట్టం ప్రకారం.. నీరు, చెట్టు, భూమికి ఎలాంటి హాని జరగకూడదు. ప్రస్తుతం ఇటుకలకు డిమాండ్ ఉండడం.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. అడవుల్లో కలప, వాగు ప్రవాహాల సమీపంలోని ప్రభుత్వ భూముల్లో గల మట్టిని బట్టీల నిర్వాహకులు దర్జాగా వినియోగిస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి.

భవన నిర్మాణాలు జోరుగా సాగుతుండడంతో పాటు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో ఇటుక వ్యాపారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇటుకలు రూ. 12 వేల నుంచి రూ.13 వేల వరకు ఉండేది. కానీ ప్రస్తుతం ట్రాక్టర్ ఇటుకలు రూ. 19 వేల నుంచి రూ.20వేల వరకు అమ్ముతున్నారంటే.. సిండికేట్ వ్యాపారం ఎలా నడుస్తుందో ఇట్టే అర్థమవుతోంది. లైట్‌వెయిట్ ఇటుక పేరుతో ఒక్కో ఇటుకను రూ.10 నుంచి (మిగతా 8వ పేజీలో)

రాష్ట్రంలోనే బెస్ట్

లివింగ్ సిటీగా ఖమ్మం

- ఖమ్మాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం
- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- లకారం చెరువులో చేపపిల్లల వదిలిన మంత్రి



లకారం చెరువులో చేపపిల్లలు విడుదల చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రభుత్వం ఖమ్మం నగరాన్ని రాష్ట్రంలోనే బెస్ట్ లివింగ్ సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఖమ్మం లకారం చెరువులో 82,500 చేపపిల్లలను వదిలారు. ఈ క్రమంలో అధికారులతో కలిసి చెరువును సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఖమ్మంజిల్లా, నగర అభివృద్ధికి తన వంతు కృషి చేశానని, నిధులను మంజూరు చేయించి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపానన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పేదల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యమని ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగా నిజమైన నిరుపేదలకు ఇళ్ల నిర్మాణంతో పాటు, వారి జీవనోపాధికి అవసరమైన కులవృత్తులను ప్రోత్సహిస్తోందని, గంగపుత్రులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. గతంలో మురికి కూపంగా ఉన్న లకారం చెరువును పర్యాటక చెరువుగా అభివృద్ధి చేయడం జరిగిందని, గోళ్లపాడు చానల్ పక్కన ఉన్న పేదవారిని వేరేచోటకు తరలించి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను చదివించాలని, పిల్లలు విద్యావంతులైతే కుటుంబాల స్థితిగతులు మారుతాయన్నారు. గత ముఖ్యమంత్రిని ఖమ్మం తీసుకువచ్చి నగర స్వరూపం చూపించి మిషన్ కాకతీయ కింద లకారం చెరువును అభివృద్ధి చేశామని, ఆక్రమణలకు గురైన లకారం చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామన్నారు. అలాగే గోళ్లపాడు చానల్ సుందరీకరణ, కొత్తబస్టాండ్, నగర రోడ్ల విస్తరణ, డివైడర్లు, లైటింగ్‌తో ఖమ్మం నగర స్వరూపం మార్చేశామన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును మోడల్‌గా అభివృద్ధి చేసేందుకు పనులు జరుగుతున్నాయని దీంతో నగర వాసులకు ఆహ్లాదకరవాతావరణం దక్కబోతోందన్నారు. ఖమ్మంలో మెడికల్, ఇంజనీరింగ్‌తో పాటు ఇంటర్నేషనల్ పాఠశాలల ఏర్పాటుచేయడం జరుగుతుందని, విద్యారంగంలో ఖమ్మం మోడల్‌గా ఉందన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమంకోసం చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేస్తున్నామని, ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మంత్రి తుమ్మల సహకారంతో ఖమ్మంజిల్లాతో పాటు నగర అభివృద్ధి జరిగిందని, ఆయన మంత్రిగా ఖమ్మం అభివృద్ధికిచేసిన కృషి శాశ్వతమన్నారు. కార్పొరేటర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ లకారంచెరువును అభివృద్ధి చేసిన ఘనత మంత్రి తుమ్మలదేనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీపీ సునిల్‌దత్, జిల్లా మత్యశాఖ అధికారి శివప్రసాద్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదాల్లో మరణించిన ఇద్దరు మత్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున సాయం చెక్కులు అందించారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అమ్మో.. చలి

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలితీవ్రత
- 13డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే ఐదు డిగ్రీల మేర పడిపోయిన వైనం
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం



కరకగూడెంలో చలి కాగుతున్న ప్రజలు

కొత్తగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి చేరుకుంటుండటంతో ప్రజలు అమ్మో చలి అంటూ వణికిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచే చల్లని వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక అర్థరాత్రి అయితే చలి తీవ్రత తీవ్రంగా ఉంటోంది. అయితే ఏటా సంక్రాంతి సమయానికి ఉండే చలి తీవ్రత.. ఈ ఏడాది దీపావళి తర్వాతి నుంచే ప్రారంభమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక సంక్రాంతి సమయానికి ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు. పగటిపూట 30 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా రాత్రి వేళల్లో 17నుంచి 19 డిగ్రీలు మాత్రమే నమోదవుతున్నాయి. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలలో 13.5డిగ్రీలు నమోదుకాగా గతేడాది ఇదే సమయానికి ఈ ప్రాంతంలో 19.7డిగ్రీలు, ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రావినూతలలో 13.9డిగ్రీలు నమోదుకాగా గతేడాది ఇదే సమయంలో అక్కడ 21.6 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సగటున 20.1 డిగ్రీల సాధారణ ఉష్ణోగ్రత కాగా.. ఈ యేడాది 15.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లాలో 20.4 సాధారణం కాగా.. 16.2 డిగ్రీలు నమోదైంది. గతేడాది కొత్తగూడెం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇంత తక్కువస్థాయిలో నమోదవడం ఇదే తొలిసారి. కాగా ఈ చలి తీవ్రత మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతుండగా.. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రత మరో రెండు డిగ్రీలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రజలు, పంటలపై తీవ్ర ప్రభావం:

దీర్ఘకాలిక, గుండె సంబంధిత వ్యాధులున్న వారు చలికాలంలో జాగ్రతలు పాటిచాల్సిందేనంటున్నారు వైద్యులు. వీలైనంత వరకు చలిలో తిరగకుండా ఉండటం మంచిదని, చలితో గుండెపోటు, ఛాతీ నొప్పులు వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. సైనస్ లాంటి సమస్యలున్నవారు మరిన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇక చలి తీవ్రతతో పాటు అదే స్థాయిలో మంచు కూడా కురుస్తుండటం వల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం కూడా ఉంది. జిల్లాల్లో సాగు చేసే పత్తి, మిర్చి, వరి పంటలపై పడుతుందని చెబుతున్నారు. అధిక చలికి నేలలోని సూక్ష్మ పోషకాలు సరైన మోతాదులో పంటలకు అందక (మిగతా 6వ పేజీలో)



కక్షిదారుడికి అవార్డు కాపీని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా

ప్రత్యేక లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేసుల రాజీతో ఇరువర్గాల సమయం, డబ్బు ఆదా అవుతుందని, సహృద్భావ వాతావరణం కూడా ఏర్పడుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయాధికారి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం ఖమ్మం న్యాయసేవాసదన్‌లో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన అన్ని క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద బీమా కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించడం జరిగిందని, న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ప్రీ లిటిగేషన్ కేసులు, మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించడం జరిగిందని, లోక్ అదాలత్‌తో రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులకు విలువైన సమయం డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు రాజీ పడడం ద్వారా ఇరుపక్షాలు గెలుపొందే అవకాశం ఉందన్నారు ఇరుపక్షాలు గెలవడం ద్వారా ఇద్దరి మధ్య మంచి వాతావరణం నెలకొంటుందన్నారు. జస్టిస్ వీ ఆర్ కృష్ణయ్యర్ అన్న మాటలను గుర్తు చేస్తూ కక్షిదారులను లీగల్ పేషెంట్లుగా అభివర్ణించారు. కక్షిదారుడు అన్యాయం జరిగి బాధకు గురై కోర్టుని ఆశ్రయిస్తారని, అలాంటి వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని రోగి ఆలస్యంగా వచ్చారని చికిత్స చేయకుండా పంపించి వేయలేం కదా! అలాగే కక్షిదారులకు న్యాయమైన చికిత్స చేయించాలన్నారు. ఈ ప్రత్యేక లోక్‌అదాలత్‌కు సహకరించిన బీమా కంపెనీలు, పోలీసులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పరిష్కారమైన కేసుల లోని కక్షిదారులకు పూల మొక్కలు బహూకరించి లోక్ అదాలత్ అవార్డులు అందించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 4635 కేసుల పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు రాంప్రసాదరావు, అర్చన కుమారి, శివరంజని, మురళీమోహన్, దీప, రజని, బిందుప్రియ, మాధవి, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

నేటి నుంచి స్కూళ్లలో తనిఖీలు

ఏన్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెల 17 నుంచి 22 వరకు ప్రభుత్వ స్కూళ్లలో ఉన్నతాధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టనున్నారు. పాఠశాలల వసతులు, విద్యార్థుల రక్షణ, పరిశుభ్రత, అభ్యసన సామర్థ్యాల పరిశీలన కోసం విద్యాశాఖ స్పెషల్ క్యాంపెయిన్ 5.0 పేరుతో ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ 33జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాకు మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, భద్రాద్రి కొత్తగూడేనికి ఎస్ఎస్ఏ జేడీ వెంకటనర్సమ్మ ఇన్‌చార్జ్‌లుగా నియమితులయ్యారు.

తనిఖీ అంశాలు

పాతఫైళ్లు, పగిలిపోయిన వస్తువులు, మరమ్మతు చేయలేని ఫర్నిచర్ తొలగింపు, భవనాల పైకప్పు పూర్తిగా తొలగించి, నీరు నిలవకుండా చేయడం, మెయింటెన్స్ గ్రాండ్ నుంచి ఎలక్ట్రికల్ వైరింగ్, ఫ్యాన్, లైట్ల మరమ్మతులు చేయించడం, గోడల పగుళ్లు, తలుపులు, కిటికీల్లో ఉన్న లోపాలను గుర్తించి తక్షణం మరమ్మతుల పనులు చేపట్టడం ఉపయోగంలో లేని మరుగుదొడ్లను తిరిగి వినియోగంలోకి తేవడం గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ సహాయంతో పాఠశాల ప్రాంగణంలోని పొదలను (మిగతా 6వ పేజీలో)

ఆంగ్లేయులతో పోరాడిన

మహోన్నత వ్యక్తి బిర్సాముండా

- గిరిజన జాతరలు, కళలు, భాషలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- బిర్సాముండా జయంతి కార్యక్రమానికి హాజరు



ప్రసంగిస్తున్న మంత్రి లక్ష్మణ్



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

భద్రాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం చిన్నతనంలోనే ఆంగ్లేయులతో పోరాడిన మహోన్నత వ్యక్తి బిర్సాముండా అని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. భద్రాచలంలో శనివారం బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని జన్ జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిర్సా ముండాను గిరిజనులు ధర్తి అబ్బా (భూమాత తండ్రి)అని గౌరవించారని, సమాజంలో నిద్రించిన ఆత్మ గౌరవాన్ని మేల్కొలిపి గిరిజనుల ఐక్యత, సమానత్వం కోసం పని చేశారని పేర్కొన్నారు. బిర్సాముండా నాయకత్వంలో బ్రిటీషు వలస పాలనను కుదిపేసిన ఉలుగులాన్ మహా గర్జన.. కేవలం తిరుగుబాటు కాదని, భూమి హక్కులు, సంస్కృతి, స్వేచ్ఛ, గిరిజన గౌరవాన్ని కాపాడేందుకు సాగిన పవిత్ర విప్లవమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జన జాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించడం ఆయన చారిత్రాక పోరాటానికి ఇచ్చిన అత్యున్నత గౌరవమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన, ఆదివాసీ, దళిత, దివ్యాంగుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలకు బిర్సాముండా స్ఫూర్తిగా తీసుకొని భూమి హక్కులు, విద్య, ఉపాధి గిరిజనులకు ప్రత్యేక రక్షణలో ప్రభుత్వంప్రాధాన్యంగా తీసుకుంటుందన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేందుకు జోడేఘాట్, మేడారం, భద్రాచలం వంటి కేంద్రాల్లో మ్యూజియాల అభివృద్ధికి గిరిజన జాతరలకు సంప్రదాయ కళలకు భాషలకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అనంతరం నీట్, జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందించారు. అలాగే ఆదివాసీ కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అంతకు ముందు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజనులకు అందిస్తున్న వివిధ సంక్షమ పథకాలపై జిల్లా, ఐటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మంత్రి ఐటీడీఏలో వివిధ ప్రభుత్వ విభాగాలకు రావాల్సిన గ్రాంట్లు వచ్చేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, టీసీఆర్‌అండ్‌టీ డైరెక్టర్ సముజ్వాల, అసిస్టెంట్ డైరెక్టర్ పీవీ పద్మ, జీఎం శంకర్‌రావు, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు. అనంతరం మంత్రి లక్ష్మణ్ సీతా రామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, ఉద్యోగులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

మహాత్ముడి ఆశయాలు యువతతోనే సాధ్యం

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- స్వదేశీ వస్తు వినియోగంతోనే దేశాభివృద్ధి సాధ్యం : తుమ్మల యుగంధర్
- ఘనంగా వందేమాతరం @ 150

7

ముత్తాపురం, మూకమామిడిలో... 'ఏకలవ్య' స్కూళ్ల ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

6

ఉమ్మడి జిల్లా టీటీ జట్ల ఎంపికలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి 30 వరకు మోయినాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఎంపికలకు తొలిరోజు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీలను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వీరిని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, సెక్రెటరీ కమ్ కోచ్ ఒలేటి సాంబమూర్తి ప్రకటించారు. ఎంపికలను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు పరిటాల చలపతి, జవహర్‌పాషా, రెడ్డిసాయి శివ, ధామస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక



సుబ్బయ్య, వేణు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక శుక్రవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా మేదరమట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి వేణు తోపాటు పలువురిని సంఘం సభ్యులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన సుబ్బయ్యకు 132 ఓట్లురాగా కళ్యాణం కృష్ణయ్యకు 11 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారిగా ఎం.నాగయ్య, పరిశీలకులుగా ప్రహ్లాదరావు వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శిగా రాయల వెంకటనారాయణ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి.వెంచిరెడ్డి, ఉపాధ్యక్షుడు సాధినేని పూర్ణచంద్రరావు, పి.సాంబశివరావు, ఆర్.దుర్గాదేవి,కార్యదర్శిటి.జనార్ధన్‌రావు,ఎస్.లక్ష్మీపతిరావు, జాయింట్ సెక్రటరి ఖాజామొహినుద్దీన్, పి.జానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి అంబేద్కర్ ఓపెన్ తరగతులు

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు15(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ జాకీరుల్లా, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ గుగులోత్ వీరన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంఅధ్యయన కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటినుంచి పీజీ ద్వితీయ సంవత్సరం తరగతులు

ఈనెల 16నుంచి 2026 మార్చి1 వరకు పీజీ ద్వితీయ సంవత్సర తరగతులు జరుగుతాయని, యూజీ సెమిస్టర్ 1,3,5తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

18వరకు పీజీ స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో వివిధ పీజీ కోర్సుల్లో చేరడానికి ఈనెల18వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ రాయని వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎం.ఏ తెలుగు, ఎకనామిక్స్‌ఎం.కాం,ఎం.ఎస్.సి జువాలజీ,బాటనీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అవకాశముందని తెలిపారు.

ముత్తాపురం, మూకమామిడిలో...

ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓఎస్‌డీ శ్రీనివాసరావు, పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ రాఘురామరెడ్డి

గుండాల/ములకలపల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): గుండాల మండలంలోని ముత్తాపురం, ములకలపల్లి మండలంలో మూకమామిడి గ్రామాల్లో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను శనివారం ప్రారంభించారు. గుజరాత్ రాష్ట్రంలోని డెడియాపడ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ముత్తాపురంలో ఏకలవ్య పాఠశాలల ఓఎస్డీ ఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నితిన్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం ఏకలవ్య మోడల్ స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. ఏకలవ్య మోడల్ స్కూల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చక్కటి లక్ష్యాలతో ముందుకు అడుగులు వేయాలని సూచించారు. ఇది ఈప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, ఎంఈఓ పార్వతమ్మ, ఏఈ సుక్యా, వైస్ ప్రిన్సిపాల్ ముఖేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే. ఖదీర్, ముత్యమాచారి తదితరులు పాల్గొన్నారు.మూకమామిడిలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాకు మరికొన్ని ఏకలవ్య పాఠశాలలను తీసుకొస్తానని, ఈ పాఠశాలలో వసతులు చాలా బాగున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇక ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి వీడియో సందేశాన్ని విద్యార్థులు, అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యే వీక్షించారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

టీజీఈ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు



ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ఆధునిక దేవాలయాలని పుస్తక పఠనంతో జ్ఞానబివృద్ధి సాధ్యమని తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ ఏలూరు శ్రీనివాసరావు అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా రెండోరోజు పుస్తక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ కార్యదర్శి జైపాల్ జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ ఎన్ రాజు సెక్రటరీ ఇమామ్, గ్రంథాలయ ఉద్యోగులు జె భాస్కరరావు, లలిత కుమారి, సిహెచ్ శ్రీనివాస్, భూక్యా బాబు, కే రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈవో సుదర్శన్ రెడ్డి

కొత్తగూడెంకలెక్టరేట్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి శనివారం ఈఆర్ఓలు, ఏఆర్ఓలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత అంశాలను ఆయన సమీక్షించారు. ఓటర్‌జాబితా నవీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, ఫీల్డ్ ధృవీకరణ, డేటా ఎంట్రీ ఖచ్చితత్వం వంటి ముఖ్య అంశాలపై సీఈఓ అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఎలక్షన్ ట్రయినర్ సాయి కృష్ణ, ఎన్నికలసిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం అక్రమ రవాణా

నియంత్రణకు కృషి

డీటీ విజయ్‌బాబు



చెక్‌పోస్టు వద్ద పౌరసరఫరాల అధికారులు

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): ధాన్యం అక్రమ రవాణాని నియంత్రించేందుకు సరిహద్దుల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాల శాఖ డీటి విజయ్‌బాబు తెలిపారు. ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ధాన్యం రవాణా కాకుండా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం పౌరసరఫరాలశాఖ డీటీ విజయ్ ముదిగొండ మండలం వల్లభిలో ఏర్పాటు చేసిన ధాన్యం చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. రాష్ట్రంలో సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం అందిస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు జిల్లా సరిహద్దు వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీ నుంచి అక్రమంగా ధాన్యం రవాణా చేయడానికి వీలు లేదని, 24 గంటల పాటు అధికారులు చెక్ పోస్ట్ వద్ద కాపలా ఉంచుతున్నట్లు తెలిపారు. అక్రమంగా ధాన్యం రవాణా చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనం, ధాన్యం సీజ్ చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

పాలెపు ఆధ్వర్యంలో తుమ్మల జన్మదిన వేడుకలు

- గండుగులపల్లిలో మంత్రికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, కార్పొరేటర్ పాలేపు
- మదర్ థెరిస్సా ఆశ్రమంలో అన్నదానం



తుమ్మలను సన్మానిస్తున్న కార్పొరేటర్ పాలెపు విజయ, వెంకటరమణ

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఖమ్మం 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ, కాంగ్రెస్ నాయకుడు పాలెపు వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాలెపు దంపతులు శనివారం మంత్రి స్వగ్రామమైన గండుగులపల్లికి వెళ్లి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవాస్థానం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్పొరేటర్ దంపతులను అభినందించారు. ఈసందర్భంగా పాలెపు మాట్లాడుతూ అభివృద్ధికి సరిహద్దులు లేవంటూ ఉమ్మడి తెలుగురాష్ట్రం అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఖమ్మంనగరంలోని మదర్ థెరిస్సా అనాథాశ్రయంలో 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపువిజయ, వెంకటరమణ, ముస్లీం, మైనార్టీ నాయకులు ఆధ్వర్యంలో తుమ్మల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.శరణాలయంలోని బాలికతో మంత్రి జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర

- మాలమహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

భద్రాచలం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ, బీజేపీ కుట్రకు పాల్పడుతున్నారని ఇది చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్రని మాలమహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ఆరోపించారు. భద్రాచలంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పంజాబ్, హర్యానాల్లో తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వమే ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టగా దేశం మొత్తం మోదీ దీనిని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు మాలలకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. రెండు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని తొక్కేస్తుంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. మాలల ఉనికిని కోల్పోతున్న క్రమంలో శాంతియుత పోరాటానికి మాలలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పల్లంటి రమేష్, సి. రాజారత్నం. బాబు, అల్లాడి పౌల్‌రాజు, బిట్ల సాయిబాబు, బల్లెం లక్ష్మణ్, బండికళ్ల రవిబాబు, బత్తుల రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూళ్లలో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

తొలగించడం, భవనానికి 2 మీటర్ల లోపల ఉన్న నిర్మాణానికి హాని కలిగించే చెట్లను తొలగించడం, మరమ్మతులతో తిరిగి వాడుకోగల పర్నిచర్‌కు మరమ్మతులు చేపట్టడం, స్టోర్ ప్లాస్టరింగ్ పూర్తి చేయించడం, బోర్ మోటారు మరమ్మతులు లేదా తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేయించడం, చార్ట్ పేపర్ మీద పాఠశాల ప్రాంగణానికి డయాగ్రామ్ వేసి, పిల్లలతో కలిసి మాస్టర్‌ప్లాన్ తయారు చేయించడం, కాంపౌండ్‌వాల్, గేట్, క్లాస్‌రూమ్స్, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్, వాటర్‌సంప్, డైనింగ్‌హాల్ మొదలైనవి మ్యాప్‌లో గుర్తించడం, నీరు నిలిచే ప్రదేశాల్లో సోమ్ పిట్ ఏర్పాటు, మరుగుదొడ్లు మరిన్ని అవసరమైతే వాటికోసం అనుకూలమైన ప్రదేశం గుర్తించడం, కిచెన్‌షెడ్, వాటర్‌సంప్, డైనింగ్‌హాల్, అదనపు క్లాస్‌రూమ్స్ మొదలైన వాటి ప్రదేశాలను గుర్తించడం సరిహద్దు మొక్కలు, బాహ్య పొర, వెదురు, సుబాబుల్, నువ్వులు, వేప, అంతర్గత పొర: మునగ, చింత, కరివేపాకు, ఉసిరి, వెలగ, పనస, అల్లనేరేడు

ఆటస్థలం : కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఇసుక పెట్టె, టైర్ ప్లే ఏరియా

నేచర్‌జోన్: చెట్లునాటటడం, ఇప్ప, మోదుగ, సిస్సో, గురువింద, సీతాఫల, కంకుడు, మద్ది, నారప, అవకాడో, మాకడేమియా ఔషధతోట, తులసి , ఇన్సులిన్ ప్లాంట్, నల్లేరు, నేలఉసిరి, రణపాల, కలబంద, వేఇవర్, లెమన్‌గ్రాస్, అశ్వగంధ,

న్యూట్రీగార్డెన్ : కాంక్రీట్ రింగులు, జీఐ వైర్లు, మల్చింగ్,

కాంపోస్ట్ ప్రదేశం : నీటి వనరుకు సమీపంలో మినీ క్వెయిల్ యూనిట్. 50పక్షులు సోలార్ డ్రయ్యర్, మట్టి పరీక్షశాల, నర్సరీ ఏర్పాటు చేయడం వంటి అంశాలను బృందం పరిశీలిస్తుంది. సీఎంశ్రీ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వనుంది.

సరిహద్దు తనిఖీ కేంద్రం ఏర్పాటు

దుమ్ముగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చత్తీస్‌ఘడ్-తెలంగాణా సరిహద్దు పైడిగూడెం వద్ద రాష్ట్ర సరిహద్దు ధాన్యం తనిఖీ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. చత్తీస్‌ఘడ్ నుంచి ధాన్యం తెలంగాణకు రాకుండా కట్టుదిట్టం చేసేందుకే ఈ చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్లు సివిల్ సప్లయిస్ డీటీ గుండి రాజులు తెలిపారు. ఏఈఓలు ప్రవీణ్, హసీనా, జీపీఓ వెంకన్న, రెవెన్యూ సిబ్బంది అంజద్ పాల్గొన్నారు. కాగా చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అన్ని రకాల ధాన్యానికి క్వింటాకు రూ.2,200ల మద్దతు ధరతోపాటు, రూ.1,000ల బోనస్ చెల్లిస్తోంది. పైగా తెలంగాణ నుంచే చత్తీస్‌ఘడ్‌కు ధాన్యం ఏటా తరలివెళ్తోంది. ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు కూడా మొక్కుబడి తంతేననే వాదనలు వినబడుతున్నాయి.



కొత్తగూడెంలో ఉన్ని దుస్తుల దుకాణం

అమ్మో చలి..

(5వ పేజీ తరువాయి)

పంటలు ఎరుపు రంగులోకి మారే అవకాశం ఉందంటున్నారు. అలాగే తెగుళ్ల కూడా అధికమయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మిరప పంటలో పూత, కాత రాలడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి.

ఉన్నిదుస్తులు, రగ్గులకు పెరిగిన డిమాండ్..

చలి తీవ్రత రోజు రోజుకి పెరుగుతుండడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు ఉన్నిదుస్తులు, రగ్గులు కొనుగోలు చేస్తున్నారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో, కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ ఏరియాలో రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు చెందిన చిరువ్యాపారులు ఈ దుస్తులను విక్రయిస్తున్నారు. దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు ఇరవై కుటుంబాలు రగ్గులు విక్రయిస్తున్నారు. వారు పంజాబ్‌లోని లుధియానా నుంచి ఈ వస్తువులను కొనుగోలు చేసి కొత్తగూడెంలో విక్రయిస్తున్నారు.

చలి ఎక్కువగా ఉంటే విక్రయాలు బాగుంటాయి

జితేందర్, వ్యాపారి, మధ్యప్రదేశ్



ప్రతీ ఏడాది చలి కాలంలో కొత్తగూడెంలో విక్రయాలకు మధ్యప్రదేశ్ నుంచి వస్తూ ఉంటాం. చలి ఎక్కువగా ఉంటే విక్రయాలు బాగుంటాయి. ఈ ఏడాది ప్రారంభ దశలోనే ఉంది. సరుకును తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. చలి తీవ్రం కావడంతో గతేడాది కంటే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఉన్ని దుస్తులు, రగ్గుల విక్రయాలు జరుగుతున్నాయి.

ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

రవితేజ, వైద్యాధికారి కరకగూడెం



చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రత వల్ల దగ్గు, జలుబుతో పాటు వైరల్ జ్వరాలు వస్తాయి. ఉన్ని దుస్తులను ప్రజలు వాడాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఉపయోగించాలి. చర్మం పగుళ్ల రాకుండా ఉండేందుకు ఒంటి నిండా దుస్తులు ధరించాలి. వృద్ధులు, చిన్నారులు అగ్ని మంటల వద్దకు వెళ్లకుండా ఉండాలి. చర్మం సున్నితంగా ఉండేలా లోషన్లు, క్రీములు రాసుకోవాలి. గోరు వెచ్చని నీరు తాగడంతో పాటు మంచి ఆహారం తీసుకోవాలి. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా వైద్యులను ఆశ్రయించాలి.

పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్తు

భద్రాద్రి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి

చుంచుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యో తి): పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్ సాధించగలుగుతామని భద్రాద్రి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి విద్యార్థులు, పాఠకులకు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రెండోరోజు శనివారం కొత్తగూడెంని జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనంతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని, ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వందలాది మంది విద్యార్థులు పుస్తక ప్రదర్శనను వీక్షించారు. అనంతరం గ్రంథాలయం నుంచి పుస్తక ప్రదర్శన ర్యాలీని ప్రారంభించి పోస్టాఫీస్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు నిర్వహించి పుస్తక ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర కళాశాల అధ్యాపకురాలు పద్మా, గ్రంథపాలకురాలు జి.మణి మృదుల, మధుబాబు, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసంతో ఆరోగ్యం..

ఖమ్మం సీటీసీ అడిషనల్ డీసీపీ విజయ్‌బాబు

విహార యాత్రకు వెళ్లిన తలసీమియా చిన్నారులు



తలసీమియా చిన్నారుల విహార యాత్ర దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి మానసిక ఉల్లాసంతో జీవిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ విజయ్‌బాబు అన్నారు. శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో తలసీమియా చిన్నారులను ఏపీలోని బాపట్ల బీచ్ విహారయాత్రకు తీసుకెళ్లారు. బీచ్ వద్ద చిన్నారులకు సదుపాయాలు కల్పించిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ తలసీమియా చిన్నారుల ఆరోగ్యంతో పాటు వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు సంకల్ప చేస్తున్న కృషి అభినందనీ యమన్నారు. చిన్నారులకు తమ లోపాన్ని గుర్తు చేయ కుండా నిత్యం సరదాగా సాధారణ వ్యక్తుల్లా గడిపేలా తల్లిదండ్రులు వ్యవహరించాలని సూచించారు. చిన్నారులతో సరదాగా గడపడం మానసిక తృప్తిని ఇచ్చిందని, వీరి కోసం తన వంతుగా సంకల్పతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. బీచ్ వద్ద చిన్నారుల కోసం సౌకర్యాలు కల్పించిన అడిషనల్ డీసీపీ విజయ్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనిత, ఉపాధ్యక్షురాలు పి.పావని, బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్ భాస్కర్, పి.వంశీకిరీటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం



భక్తులతో నిండిన శ్రీవారి అంతరాలయం

ఎర్రుపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శనివారం కార్తీక ఏకాదశి కావడంతో ఆలయలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. చుట్టుపక్క గ్రామాలనుంచి మహిళలు కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్నవితరణ చేశారు. సాయంత్రం ఏకాదశి కావడంతో ఆలయావరణలో భక్తదంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, ముఖ్య అర్చకులు రఘురామకృష్ణ, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆదివాసీలకు అండగా ఉంటాం

అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్

6 గ్రామాల ప్రజలకు నిత్యావసర సరకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

చర్ల/దుమ్ముగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం చర్ల మండలంలోని వసల ఆదివాసీ గ్రామాలైన బక్కచింతలపాడు, కిష్టారం పాడు, వీరాపురం, రాళ్ళాపురం, తిమ్మిరిగూడెం, కమలాపురం, గ్రామాలకు చెందిన 250 కుటుంబాలకు నెస్లె కంపెనీ అందజేసిన నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్, విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ పేదల కోసం పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. ఆదివాసీ గ్రామాల్లోని ప్రజలకు విద్య, వైద్యం, రవాణా కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా చర్ల మండలంలోని అనేక గ్రామాలకు వివిధ సౌకర్యాలు కల్పించామన్నారు. అలాగే అటవీగ్రామాల ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అస్టెంట్ కమాండెంట్ వివేక్ రంజన్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ ఉన్నారు.

ఆదివాసీ ప్రజల సంక్షేమమే పోలీస్ లక్ష్యం

మావోయిస్టు ప్రభావిత ప్రాంత ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుబడి ఉందని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ అన్నారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం మండలంలోని గొత్తికోయ గ్రామం ముల్కనాపల్లి కొత్తగుంపును సందర్శించారు.

బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాద్రి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు శివరాంజీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భద్రాద్రి జిల్లా వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు శివరాంజీ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం బీఎస్ఎన్ఎల్ డీఈ కార్యాలయంలో సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం నిర్వహించగా రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. అదే విధంగా పెన్షన్‌దారులకు లైఫ్ సర్టిఫికెట్స్, సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం, ఆరోగ్యం సమస్యలకు అప్రమత్తంగా ఉండాలని సలహాలు సూచించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు నూర్ మొహమ్మద్, జయంతరావు, రాజయ్య, మజీద్, ఆంజనేయులు, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయాలు యువతతోనే సాధ్యం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
స్వదేశీ వస్తు వినియోగంతోనే దేశాభివృద్ధి సాధ్యం: తుమ్మల యుగంధర్
ఘనంగా వందేమాతరం @ 150


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు


గాంధీ వేషధారణలో చరఖాలను తిప్పుతున్న చిన్నారులు

ఖమ్మం అర్బన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఆశయసాధన యువతతోనే సాధ్యం అవుతుందని, అందుకు యువత ముందుకు రావాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. అలాగే స్వదేశీ వస్తు వినియోగంతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నేత తుమ్మల యుగంధర్ పిలుపునిచ్చారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం గాంధీగ్లోబల్ ఫ్యామిలీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం @ 150 కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి వందేమాతర గీతం విశిష్టత గురించి ప్రసంగించారు. దేశానికి అతిపెద్ద బలం యువతేనని యువత సన్మార్గంలో పయనించి దేశానికి శక్తిగా మారాలన్నారు. చెడు అలవాట్లు, ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే దేశాభివృద్ధికి తమవంతుగా దోహదపడాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో యువత పయనించాలన్నారు. బ్రిటీష్ వారిని పారద్రోలగా నడిపడిందని, బ్రిటీష్ సంస్కృతిని పారద్రోలిన నాడే అసలైన స్వాతంత్య్రం అన్న మహాత్ముని మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా స్వదేశీ వస్తు వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ దేశాభివృద్ధికి సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో 1156 మహాత్మాగాంధీ విగ్రహాలను, 156 చరఖాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు సంజయ్‌రెడ్డి, వైరా నియోజకవర్గ నాయకులు విజయబాబు, శ్రీలక్ష్మి, గాంధీ సంస్థల చైర్మన్ దున్న రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ గాంధారి ప్రభాకర్, ఆర్గనైజేషన్ సెక్రటరీ మెరుగు మధు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, పలు నియోజకవర్గాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి తుమ్మల



మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి తుమ్మల దంపతుల ప్రత్యేక పూజలు

అశ్వారావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఏలూరు జిల్లా గుర్వాయిగూడెం వద్ద వేంచేసివున్న మద్ది ఆంజనేయస్వామిని శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు దర్శించుకున్నారు. శనివారం మంత్రి తుమ్మల జన్మదినోత్సవం సందర్భంగా సతీసమేతంగా మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సాంప్రదాయం ప్రకారం తుమ్మలకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయ కమిటీ వారు మంత్రి తుమ్మల దంపతులను సత్కరించి వేదపండితుల ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నవభారతాన్ని నిర్మించిన మహనీయుడు వల్లభాయ్ పటేల్

కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో యూనిటీ మార్చ్ ప్రారంభించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, తదితరులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నవ భారత నిర్మాణం కోసం కృషిచేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఆయన అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు పయనించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడ వ్యవహారాల మంత్రిత్వశాఖ, మేరా యువ భారత్ ఖమ్మం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యూనిటీ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించి కలెక్టర్ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో వల్లభాయ్ పటేల్, భరతమాత చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా దేశంలో స్వేచ్ఛ కోసం వల్లభాయ్ పటేల్ తపించే వారని, ఎన్ని బాటలు మాట్లాడిన, ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒక దేశని చాటిచెప్పారని వివరించారు. స్వాతంత్రం అనంతరం సంస్థానాలుగా విడిపోయిన ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ కృషి చేశారన్నారు. భారతదేశ ప్రజల్లో చైతన్య పరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి ప్రతి పౌరుడు దేశీయ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని, దేశానికి సహకరించాలని ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరిచే ఐక్యత (ఆత్మ నిర్భరభారత్) ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేరా యువభారత్ ఖమ్మం జిల్లా ఆఫీసర్ అధికారి కొంపుండర్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, డీఎస్‌వో వరదామరెడ్డి, ఎన్‌సీసీ నయాబ్ సుబేదార్ లక్ష్మణ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ వేముల కామేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు కేవీ.రంగాకిరణ్, యువ భారత్ సభ్యులు పద్మ, పి.విక్రతి, బీగోపేక్షిత్ర, వి.ప్రభాకర్‌రెడ్డి, నయ్యద్ పారుక్ ఇమాన్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరా మహిళా డెయిరీ రెండవ విడత లబ్ధిదారుల ఎంపిక, నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డెయిరీ మెరుగ్గా నిర్వహించేందుకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్ లుగా ఎంబీఏ అభ్యర్థులను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు వీలుగా ఆడిట్ బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. భవిష్యత్తులో 5 వేల మంది లబ్ధిదారులకు 2 పశువుల చొప్పున 10 వేల పశువులు పంపిణీ చేసే నేపథ్యంలో దానికి అనుగుణంగా పాల కొనుగోలు, విక్రయం పాడి పశువుల పర్యవేక్షించేందుకు సమర్థవంతమైన మేనేజ్‌మెంట్ సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీడీవోలు జాగ్రత్తలు పాటించాలని, సబ్సిడీ క్రింద అందించే పశువుల యూనిట్లు, ఇతర పరికరాలు ఎట్టి పరిస్థితుల్లో అమ్ముకునేందుకు, దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువుల కోసం పశువుల పెడ్డు నిర్మించేలా చూడాలని, పశువుల పెడ్డు మీద సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయాలని, దీనికి పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలీ యోజన పథకం అనుసంధానం చేయాలన్నారు. పాడిపశువుల కొనుగోలులో లబ్ధిదారులు కూడా భాగస్వామ్యం కావాలని, వారి అనుమతితోనే కొనుగోలు ఫైనల్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, మధిర నియోజకవర్గం ఎంపీడీఓలు, ఏపీఎంలు, డీపీఎంలు, డెయిరీ ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న రాష్ట్ర సర్కారు

తుఫాన్ నష్టపరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం
బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు


జూలూరుపాడులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు

జూలూరుపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నప్పటికీ వారికి నష్టపరిహారాన్ని చెల్లించకుండా కాలయాపన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. శనివారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పంటలను నష్టపోయి ఉన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కడా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఎకరానికి రూ.10 వేలు చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు అందించకపోవడం తగదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్టు తెలిపారు. రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో త్వరలో ఖమ్మంలో 24గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పరిహారాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాడినేని సతీష్, నాయకులు నున్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరులు అన్ని రంగాల్లో రాణించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు

మణుగూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కుమ్మరి కులస్థులు అంతా ఐక్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ తెలిపారు. శనివారం మణుగూరులో పర్యటించిన ఆయన మునిసిపాలిటీ పరిధిలోని పీవీ-1 సెంటర్‌లో ఏర్పాటు చేసిన కుమ్మరి సంఘం నియోజకవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందొచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసి పట్టుకుని కుమ్మరి కులస్థులు విద్య, వైద్యం, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఐక్యతకు మారుపేరుగా నిలుస్తూ సమస్యలను సంఘం తరుపున పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుమ్మరులకు ప్రత్యేక నిధులను కేటాయిస్తూ వారి అభివృద్ధి సహకరించాలని కోరారు.

నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

ఈసందర్భంగా పినపాక నియోజకవర్గ మండల కుమ్మరి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా నిమ్మనగోటి వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగారపు సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పాక సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా నాంపల్లి చిరంజీవి, మెదుపురం నర్సింహారావు, కార్యవర్గ సభ్యులుగా ఆల్లాడపు సత్యం, నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శిగా నిమ్మనగోటి అనిత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అనిత, బుచ్చమ్మ, దివ్య, చిలకమ్మ, నాగమణి, శిరీష, సుజాత, కళమ్మ, భాగ్యమ్మ, కౌసల్య, పద్మ, సాయమ్మ, లక్ష్మి, అనిత, దనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనన నియంత్రణలో..
పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి

సురక్షితమైన సంతాన నిరోధక పద్ధతే వ్యాసెక్టమీ
భద్రాద్రి జిల్లాలో నాలుగేళ్లలో 122 మందికి చికిత్స
నేడు ప్రపంచ వ్యాసెక్టమీ దినం

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్న కుటుంబం ఆంటా గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేసిన నినాదం. జనాభాను తగ్గించే ఉద్దేశంలో భాగంగా జనన నియంత్రణను స్వచ్ఛందంగా చేపట్టాలని చేస్తున్న ప్రయత్నాల్లో దంపతులు ఆడువారు వేశారు. ఈ క్రమంలో భార్యపై ఎలాంటి ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు లేకుండా జనన నియంత్రణలో భర్త భాగస్వామ్యాన్ని చేస్తూ ప్రోత్సహించే విధానమే వాసెక్టమీ. సురక్షితమైన ఈ సంతాన నిరోధ పద్ధతిపై అవగాహన పెంచి కుటుంబ నియంత్రణలో పురుషులను భాగస్వామ్యం చేసే ప్రక్రియ. పురుషుల వాసెక్టమీ శస్త్రచికిత్స చేయించుకోవడం ద్వారా భార్య ట్యూబెక్టమీ చేయించుకోవాల్సిన అవసరం ఉండదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాసెక్టమీ అనేది ఒక ఎంపిక సర్జికల్ ప్రక్రియ. దీని ఫలితంగా పురుషులలో స్టెరిలైజేషన్ జరుగుతుంది. అందుకే శాశ్వత గర్భనిరోధక సాధనంగా ఉండిపోతుంది. ఈ శస్త్ర చికిత్స చేయడానికి అరగంట సమయం పడుతుంది. ఒక వారం అనంతరం తిరిగి లైంగిక కలయికను ప్రారంభించవచ్చు.

అపోహలు అవసరం లేదు

ఈ చికిత్స సురక్షితమైన, ఆరోగ్యకరమైన పద్ధతి. దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదు. చికిత్స చేయించుకుని సంతాన సంఖ్యను నిరోధించుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత నాలుగేళ్లలో 122 మంది పురుషులకు వాసెక్టమీ శస్త్ర చికిత్స చేశారు. 2021-2022లో 62 మంది, 2022-23 లో 18 మంది, 2023-24లో 31 మంది, 2024-25లో ప్రస్తుతం వరకు 11 మంది ఉన్నారు. మొత్తం 122 మంది ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద గణాంకాలు నమోదయ్యాయి.

\- డాక్టర్ తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో

సీతారామారావు మృతి తీరనిలోటు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి, పదవీ విరమణ పొందిన తర్వాత కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి స్వచ్ఛందంగా సహకరిస్తూ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అదిరాజు సీతారామారావు మృతి తీరనిలోటని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన అదిరాజు సీతారామారావు సంతాపసభలో రెవెన్యూ ఉద్యోగులతో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొని వారి సేవలను కొనియాడారు. అధికారులకు, ఉద్యోగులకు సహకరిస్తూ అందరి మన్ననలు పొందారని, వారి సేవలు మరవలేనివని, మంచి మనిషిని, అనుభవజ్ఞులైన వ్యక్తిని కోల్పోవటం బాధతో పాటు తీర్చలేని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ నేర్చుకోనేందుకు వెళ్లి...

ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి యువకుడి దుర్మరణం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ


చిర్రా హరీష్(ఫైల్)

వైరా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకునేందుకు కుతూహలంతో వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఖమ్మంజిల్లా వైరా మండలంలోని పుణ్యపురం గ్రామంలో శనివారం ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుణ్యపురం గ్రామానికి చెందిన వాకదాని కృష్ణయ్యకు చెందిన ట్రాక్టర్ అదే గ్రామంలో వాకదాని వెంకన్న పొలంలో రోటవేటర్ వేసేందుకు కృష్ణయ్య కుమారుడు అప్పారావు వెళ్తుండగా ట్రాక్టర్ నేర్చుకోవాలనే కోరికతో అదే గ్రామానికి చెందిన చిర్రా హరీష్(24) కూడా ఆ ట్రాక్టర్‌పై అప్పారావుతో కలిసి పొలానికి వెళ్లాడు. అప్పారావు ట్రాక్టర్‌తో రోటవేటర్ వేసే సమయంలో హరీష్ ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న బల్లపై కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారి రోటవేటర్ కింద పడి మృతిచెందాడు. దీంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైంది. వైరా ఎస్ఐ పుష్పాల రామారావు సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాడిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

గుండాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్లుగీసేందుకు తాడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన కుంజ చిన్నబుచ్చయ్య(48) ప్రతి రోజూ లాగానే శనివారం కూడా గ్రామ సమీపంలో కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో బలమైన గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి..

చింతకాని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వర్లు (73) చెరువులో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా మతిస్థిమితం సక్రమంగా లేని వెంకటేశ్వర్లు శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకువెళ్లాడు. కొంత సమయం తరువాత అతను చెరువులో పడి ఉన్నాడని స్థానికులు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెళ్లి చూడగా చెరువులో మృతిచెంది ఉన్నాడు. మృతుని కుమారుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూజగదిలోని దీపం అంటుకొని అగ్నిప్రమాదం

ఇల్లెందులో ఘటన


ప్రమాదం జరిగిన ఇల్లు

ఇల్లెందుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పూజ గదిలో దీపం వెలిగించి బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు ఆ దీపం అంటుకొని ఇంట్లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన ఇల్లెందు పట్టణంలో శనివారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా... ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్ సమీపంలో ఒంటరిగా నివాసం ఉండే ఆడేపు లక్ష్మీకాంతం శనివారం సాయంత్రం సమయంలో ఇంట్లో పూజగదిలో దీపం వెలిగించారు. పని నిమిత్తం బయటకు వెళ్లగా.. దీపం సమీపంలో ఉన్న వస్తువులకు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన ఇరుగుపొరుగు వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇల్లెందు ఎస్ఐ తాటిపాముల సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనా వేశారు.

కరాటే పోటీల్లో మణుగూరు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్గొండలోని దేవరకొండలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్ 2025 లో మణుగూరుకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చూపి పలు పతకాలను సాధించారని మణుగూరు టీకే సీనియర్ కరాటే మాస్టర్ కొమ్ముల పద్మ బ్లాక్‌బెల్ట్ థర్డ్ డాన్ తెలిపారు. బ్లాక్‌బెల్ట్ కటా బాలికల విభాగంలో గుగ్గోత్ రిషిక బంగారు పతకం, బ్రౌన్ బెల్ట్ బాలుర విభాగంలో నామా విగ్నేష్ గోల్డ్ మెడల్‌ను, బ్లూ బెల్ట్ బాలికల విభాగంలో గుగ్గోత్ ధ్రువిక బంగారు పతకాలను సాధించారు. వైట్‌బెల్ట్ బాలికల విభాగంలో గంగాపురి సాత్విక ద్వితీయ పతకాన్ని, విశాల్‌వర్మ, ఆదిత్య దొర, గౌతమ్, ఇస్మాక్, శ్రీనిపార్థ, నాగ విగ్నేష్ విద్యార్థులు బంగారు, వెండి, బ్రౌంజ్ మెడల్స్‌ను సాధించారని తెలిపారు. కాగా శనివారం కరాటేలో ప్రతిభ చాటి పతకాలను సాధించిన విద్యార్థులను మాస్టర్ కె.పద్మను మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు. ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుందని తెలిపారు.

టీచర్లు మరింత సమయం కేటాయించాలి


ప్రారంభిస్తున్న ఓఎస్డీ రామారావు

దుమ్ముగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థుల చదువుల పట్ల టీచర్లు మరింత సమయం కేటాయించాలని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్లానింగ్ విభాగం ఓఎస్డీ ఆర్.రామారావు అన్నారు. శనివారం సీతారామపురం ఏకలవ్య పాఠశాల నూతన భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. మొదటిసారిగా 12వ తరగతి బోర్డు పరీక్షల్లో పాల్గొంటున్న విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని సూచించారు. పాఠశాలకు రావాల్సిన సామగ్రి తొందర శాతం వచ్చిందని, మరో పది శాతం కొద్దిరోజుల్లోనే చేరుతుందన్నారు. విద్యార్థులు, టీచర్లలో ఎవరికైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బీభత్సం..
పార్కింగ్‌లో ఉన్న ఐదు బైకులు ఢీ

కామేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ కారు బీభత్సం సృష్టించింది. పార్కింగ్‌లో ఉన్న ఐదు బైకులను ఢీకొట్టిన సంఘటనలో ముచ్చర్ల క్రాస్‌రోడ్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారేపల్లికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం నుంచి కారు నడుపుకుంటూ వస్తుండగా ముచ్చర్ల క్రాస్‌రోడ్డు దగ్గర కారు అదుపుతప్పి వైన్‌షాప్ ఎదురుగా పార్కింగ్ చేసి ఉన్న ఐదు బైకులను ఢీ కొట్టింది. ఈఘటనలో కారుతో పాటు, ఐదు బైకులు ధ్వంసం అయ్యాయి.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మం క్రైమ్ నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పారిపోయిన సంఘటన శనివారం ఖమ్మం పరిధిలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామానికి చెందిన సున్నం సంధ్య నగరంలోని బైపాస్ రోడ్‌లో ఓ వంట్లన్ హాల్‌కు శుభకార్యానికి హాజరై బంధువులతో కలిసి తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆటోఎక్కింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియనివ్యక్తి చైతన్యనగర్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఆటో దిగుతూనని చెప్పి వెనుక కూర్చున మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. దీంతో బాధితులు కేకలు వేయగా సిందిపడు బైపాస్ రోడ్‌లోని కాల్వకట్ట మీదుగా పారి పోయాడు. దీంతో బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చింది.

వివాదాస్పదమైన మహిళ మృతదేహం ఖననం



ప్రార్థనామందిరం ఆవరణలో మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

పెనుబల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రార్థనా మందిరం ఆవరణలో మహిళ మృతదేహాన్ని ఖననం చేయటం వివాదానికి దారితీసింది. ఇక్కడ ఖననం చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన శనివారం పెనుబల్లి మండలం కారాయిగూడెంలో జరిగింది. కారాయిగూడేనికి చెందిన పొట్టెమ్మ అనే మహిళ అంతాసాగర్ పీహెచ్‌సీలో హెచ్ఈవోగా పని చేస్తూ.. కారాయిగూడెంలోని ప్రార్థనామందిరం ఆవరణలోని ఓ రేకుల గదిలో నివాసం ఉంటోంది. ఆమె శుక్రవారం రాత్రి మృతిచెందగా అదే ప్రార్థనామందిరం ఆవరణలో మరోచోటున ఉన్న స్థలంలో ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులు, బంధువులు శనివారం ఖననం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు జనావాస సాల మధ్య, ప్రాథమిక పాఠశాల, పశువుల ఆసుపత్రి సమీపంలోనే ఉన్న ప్రార్థనామందిరం ఆవరణలో మృతదేహాన్ని ఖననం చేయడమేంటని, వెంటనే మృతదేహాన్ని తొలగించాలని వీఎంబంజర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.వెంకటేష్ పొట్టెమ్మ కుటుంబ సభ్యులను, గ్రామస్థులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే ఆదివారం లోపు ఖననం చేసిన ఆ మృతదేహాన్ని తొలగించాలని గ్రామస్థులు కోరారు.



నేడు అభ్యుదయ రచయితల సమావేశం

ఖమ్మంఅర్బన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీశతాబ్ది ఉత్సవాల సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం జిల్లా అభ్యుదయ రచయితల సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ పాత్ర సాధించిన విజయాలు చారిత్రక పోరాట ఘట్టాలు నేటి తరాలకు తెలియజేసేందుకు పాటలు, కవితలు, ప్రత్యేక కథనాలు రూపొందించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక సంచికను విడుదల చేస్తామన్నారు. అభ్యుదయ కవులు, రచయితలు, వామపక్ష అభిమానులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రచారం జాస్తి.. పర్యవేక్షణ నాస్తి

కేఎంసీలో నిర్వీర్యమైన జోనల్ పరిపాలన

ఈనెల 12నుంచి కార్యాలయానికి రాని 11మంది ఉద్యోగులు

ప్రత్యేక అధికారులు లేక పోవటంతో ఇష్టారాజ్యం

పాలనను వికేంద్రీకరించామన్నారు.. ప్రజా సమస్యల పరిష్కారానికి సుదూరం రావద్దన్నారు.. ఆటో చార్జీలు, సమయం ఆదా అని అరచేతిలో వైకుంఠం చూపారు.. కేఎంసీ కమిషనర్, మేయర్ మాటలతో పేద, మధ్యతరతి ప్రజలు అమిత ఆనందానికి గురయ్యారు.. చివరకు ఇది ప్రచార ఆర్భాటమని తెలుసుకున్నారు.



బల్లేపల్లి జోనల్ కార్యాలయం



ఉదయం 11గంటలకు విధుల్లో ఉన్న ఒకే ఉద్యోగి

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పూణె, గ్రేటర్ హైదరాబాద్ స్ఫూర్తితో ప్రజల వద్దకు పౌరసేవలు త్వరితగతిన అందించాలని ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయాలు ఇప్పుడు నిర్వీర్యమయ్యాయి. పారిశుధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇలా అన్ని విభాగాల నుంచి సిబ్బందిని జోనల్ కార్యాలయాలకు కేటాయించారు. కానీ ఆ కార్యాలయానికి పర్యవేక్షణకు మాత్రం ప్రత్యేక అధికారిని నియామకం చేయలేదు. దీంతో జోనల్ వ్యవస్థ పరిపాలనపై అనేక విమర్శలు వెలువడుతున్నాయి.

బల్లేపల్లిలో ఏక్ నిరంజన్

బల్లేపల్లి జోనల్ కార్యాలయాన్ని ఆరు నెలల క్రితం ప్రారంభించారు.18 మంది ఉద్యోగులను కేటాయించారు. ఇటీవల బిల్‌కలెక్టర్లు, ఇతరఉద్యోగుల కొరత ఏర్పడటంతో ఈనెలలో ఉద్యోగుల సంఖ్య 12కు తగ్గింది. అయితే జోనల్ కార్యాలయాలకు కేటాయించిన ఉద్యోగులు ఉదయం సమయంలో కార్యాలయానికి చేరుకొని హాజరు నమోదు చేసిన తర్వాత వారి విధులకు క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ బల్లేపల్లి జోనల్ కార్యాలయానికి కేటాయించిన వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక ఇతర విభాగాల ఉద్యోగులు జోనల్ కార్యాలయానికి రావటం లేదని స్థానికులు విమర్శలు చేస్తున్నారు.ఈనెల12నుంచి కేవలం ఒకే ఉద్యోగి మాత్రమే జోనల్ కార్యాలయానికి వచ్చి తలుపులు తీసి కూర్చొంటున్నారని కనీసంసంతకాలు చేసేందుకు రావటం లేదని జోనల్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రజలు పేర్కొంటున్నారు. పౌరసేవలు తక్షణం అందించేందుకు ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన జోనల్‌కార్యాలయాల్లో పరిపాలన గాడిలో పెట్టేందుకు ప్రత్యేక అధికారిని నియామకం చేయాలని బల్లేపల్లి జోనల్ పరిధిలో ఉన్న 1నుంచి10 డివిజన్ల ప్రజలు కోరుతున్నారు.

గతంలో అభివృద్ధిపై రాజకీయ వివక్ష

- ఇప్పుడు అదే ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మంచుకొండ, ఖమ్మంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఆ పదిడివిజన్లు అభివృద్ధికి నోచుకోలేదని, పనుల్లో రాజకీయ వివక్ష కొనసాగిందని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు ఇలా పది మంది కార్పొరేటర్ల డివిజన్లలో పదేళ్లపాటు గత ప్రభుత్వంలో రాజకీయ ఇబ్బందులతో అభివృద్ధి జరగలేదన్నారు. అయినా వారు నమ్మిన కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారు. ఇప్పుడు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. శనివారం ఖమ్మం 49వ డివిజన్‌లో రూ.3.5కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. స్థానిక కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై దెబ్బలాడి ఖమ్మానికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నానని వివరించారు. ఇప్పుడు మరో రూ.200 కోట్లు నిధులు మంజూరు జరిగాయని వివరించారు. తమకు ఇందిర్మి ఇళ్లు మంజూరు కావాలని మహిళ సునీత అడుగగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషంగా తనదైన శైలిలో సమాధానం చెప్పారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇప్పుడు ఇళ్లు ఇవ్వటం జరుగుతుందని లేని వారికి మరోసారి ఇస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వర్లు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, డివిజన్ అధ్యక్షులు ఉపేందర్‌నాయక్, పోటు నాగేశ్వరరావు, వనం వెంకటప్పారావు, సింగం శ్రీనివాసరావు, కాంతారావు, కామేశ్వరరావు, సతీష్, కెంబసర్తి నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఇన్‌చార్జీ ఈఈ ధరణి, ఉద్యాన అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినోత్సవం సందర్భంగా స్థానికంగా కార్పొరేటరు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు.

మంచుకొండలో రైతు బజార్ ప్రారంభం

రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో రైతు బజార్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ప్రారంభించారు. రైతు బజారులో మంత్రి కలయ తిరుగుతూ రైతులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. రఘునాథపాలెం మండలంలో రాబోయే రోజుల్లో రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి జరుగుతుందన్నారు. మంచుకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విశ్రాంతి గదులను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో స్వల్ప మార్పులతో మధుమేహం నియంత్రణ

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మానవ జీవనశైలిలో స్వల్ప మార్పులతో మధుమేహం నియంత్రణ సాధ్యమవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మధుమేహం-ఆరోగ్యకరమైన జీవన శైలిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రారంభించారు. పూర్వీకులు తినే రాగులు, జొన్నలు, చిరు ధాన్యాలు ఆహారంలో భాగం చేసుకోవాలని అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రామారావు మాట్లాడుతూజిల్లాలో 55 వేల 829మంది షుగర్ రోగులను గుర్తించి మందులు ప్రతీనెలా పంపిణీ చేస్తున్నామన్నారు. అంతకుముందు ఎస్ఆర్ గార్డెన్స్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ డీసీహెచ్ఎస్ రాజశేఖర్, వైద్యాధికారులు చందూనాయక్, గణేష్, సీతారాం, వేణుగోపాల్,వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్పీల వినతి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న సబిహా అంజుం

పట్టణ పేదరిక నిర్మూలనలో కీలకంగా పనిచేస్తున్న మా సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు షేక్ సబిహా అంజుం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. శనివారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కలిసి ఆర్పీల సమస్యలపై వినతిపత్రం అందించారు. సమస్యలు సానుకూలంగా విన్న తుమ్మల.. రాష్ట్రవ్యాప్తంగా ఇదేసమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆర్పీల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం కార్యదర్శి గందసిరి పద్మ, కోశాధికారి బీ మెగిలమ్మ, ఉపాధ్యాక్షురాలు రమాదేవి, సహాయ కార్యదర్శి జీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం



వాకథాన్‌లో పాల్గొన్న బ్యాంక్ సిబ్బంది

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకథాన్‌తో పాటు మొక్కలు నాటే కార్యక్రమం, రోటరీనగర్ ప్రభుత్వ హైస్కూల్‌కు కంప్యూటర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రాంతీయ అధికారి హనుమంతరెడ్డి, ఉప ప్రాంతీయ అధికారులు సర్వేశ్, సుధాకర్‌రావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



తిరుమలాయపాలెం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని వీరకాశీపట్నంలో శివపార్వతుల కళ్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయపూజారి మరకింటి వీరభద్రస్వామి వేదపండితులు లక్ష్మణ్‌శర్మ కళ్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మరికంటి సుగుణమ్మ, శంకర్, నాగమణి పాల్గొన్నారు.

కమ్మ వనసమారాధనకు భారీ ఏర్పాట్లు



వనసమారాధనకు ఏర్పాటు చేసిన వేదిక

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఆదివారం జరగనున్న కార్తీక మాస కమ్మ వనసమారాధనకు భారీఎత్తున ఏర్పాట్లు చేసినట్లు సంఘం నాయకులు శనివారం తెలిపారు. ఈసారి కార్యక్రమం మరింత ఘనంగా, సమగ్రంగా నిర్వహించేందుకు కమ్మ మహాజన సంఘం ప్రత్యేక ప్రణాళికతో ముందుకొచ్చిందని తెలిపారు. వేదిక చుట్టుప్రక్కల 16 ఎకరాల్లో పూజా స్థలం, శివాలయం, సభావేదిక, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు, భోజనశాలలు, ఎన్టీఆర్ ఫోటో గ్యాలరీ, పిల్లలు, మహిళల కోసం ప్రత్యేక పోటీ ప్రాంగణాలు, కబడ్డీతో సహా పలు క్రీడల కోసం ప్రత్యేక మైదానాలు సిద్ధం చేశామన్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా 45 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. వైరారోడ్ నుంచి వచ్చే వాహనాలకు గొల్లగూడెం,కొత్తగూడెంరోడ్ ద్వారా ప్రత్యేకఎంట్రీ మార్గం కల్పించారు. తోట ఎదురుగా కుడివైపు పార్క్ చేసిన వాహనాలకు అశ్విని (ఆదిత్య) నర్సింగ్ స్కూల్ వెనుక నుంచి ఆర్టీసీ కాలనీ, మధురానగర్ మీదుగా గొల్లగూడెం రోడ్‌కు ఎగ్జిట్ మార్గం ఏర్పాటు చేశారు. తోట ఎడమవైపు పార్కింగ్ చేసిన వాహనాలు బృందావనం వెంచర్ ఎడమ వైపు నుంచి గొల్లగూడెం రోడ్‌కు వెళ్లేలా మార్గాలు ఏర్పాటు చేశారు. త్రీటౌన్, వన్‌టౌన్ ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలకు అల్లిపురం రోడ్, చిన్న తోట ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ కల్పించారు. భక్తి కార్యక్రమాలు, దేవతారాధనలు, పిల్లల గేమ్స్, మహిళల పోటీలు, వంటలపోటీలు, ఫ్యాన్సీ డ్రస్, సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అదనంగా, సినీ కళాకారుల సంగీత విభావరి, కబడ్డీతో సహా పలు క్రీడా పోటీలు కూడా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకుల్ల నీరజ హాజరుకానున్నారు.

ఎన్టీయార్ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు

నేలకొండపల్లి:నేలకొండపల్లిలోని అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడితోటలో ఆదివారం కమ్మవారి కార్తీక వన సమారాధనను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చవళం ప్రవీణ్‌కుమార్, మద్దినేని మహేష్, అక్కినేని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక వన సమారాధనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు చెప్పారు. వన సమారాధనలో తెలుగు వారి ఆత్మ బంధువు ఎన్టీఆర్ ఫోటో ఎగ్జిబిషన్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

సత్య హరిశ్చంద్ర నాటకం నేడు

నేలకొండపల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): వేణుమాధవశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నేలకొండపల్లి శ్రీకర గార్డెన్స్‌లో సత్య హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాబోయే తరానికి నాటక రంగాన్ని గుర్తు చేయాలన్న ఉద్దేశ్యంతోనే సత్య హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. దాతల సహాయ, సహకారాలతో ప్రదర్శితమవుతున్న నాటకాన్ని తిలకించి, ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపించాయి

గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల



విజయోత్సవాల్లో పాల్గొన్న రాయల

నేలకొండపల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాయని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నేలకొండపల్లిలో జరిగిన కాంగ్రెస్ విజయోత్సవంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి రాయల పాల్గొన్నారు. పీఎస్సార్ సెంటర్లో టపాసులు కాల్చారు. ప్రజలకు మిఠాయిలు పంచారు. నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. రేవంత్‌రెడ్డిపై నమ్మకంతోనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో రాయపూడి నవీన్, బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, యడవల్లి నాగరాజు, సైదులు, రామకృష్ణ, గుడిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..

'అక్రమాల' బట్టీలు!

(5వ పేజీ తరువాయి)

రూ.12 వరకు విక్రయించడంతో మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకే జంకుతున్నారు. పెట్టుబడికి మూడింతల లాభాలు గడిస్తున్న వ్యాపారులు.. ఎలాంటి పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో గృహ నిర్మాణం పనులు ఊపందుకోవడంతో.. ఇటుక బట్టీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. బట్టీల ఏర్పాటుపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వందలాది ఇటుకబట్టీలను ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్కదానికి పూర్తిస్థాయి అనుమతులు మాత్రం లేవని తెలుస్తోంది. అలాగే ఇటుకబట్టీల నుంచి వెలువడే కాలుష్యం, బూడిద, దుమ్ముతో బట్టీల సమీపంలో ఉన్న పంట దిగుబడులతో పాటు వాహనదారులపై ప్రభావం చూపుతోందని రైతులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటుక బట్టీలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే బట్టీలకు పంచాయతీ తీర్మానం కూడా తప్పనిసరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ అధికారి అనుమతులు కూడా తీసుకోవాలి. అయితే ఇవేమీ పట్టించుకోకుండానే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో పోటీ పడి మరికొందరు వ్యాపారులు ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి యథేచ్ఛగా కలపను తరలించి ఇటుక బట్టీలను కాల్చుతున్న అధికారులకు పట్టింపు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. విలువైన అటవీ సంపదను ఇటుక బట్టీలకు తరలిస్తూ బూడిద చేస్తున్నారు. అటవీ ప్రాంతం, చెరువులు, కాల్వలకు సమీపంలో బట్టీలను ఏర్పాటు చేస్తూ విలువైన వనరులను కొల్లగొట్టేస్తున్నారు. ఇటుకల తయారీకి అనువైన మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేస్తూ లక్షలాది రూపాయల ఆదాయాన్ని వెనుకేసుకుంటున్నారు. అలాగే రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. కానీ కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అధికారుల కనుసన్నల్లోనే ఉచిత విద్యుత్‌ను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల బాల కార్మికులు కూడా ఇటుక బట్టీలలో కార్మికులుగా మారి పని చేస్తున్నా.. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు పాల్పడుతున్న ఇటుక బట్టీ నిర్వాహకులపై జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు 'మట్టి పువ్వు' ఆవిష్కరణ సభ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త ఎన్.తిర్మల్ రచించిన మట్టి పువ్వు స్వీయ వచన సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరుగుతుందని తిరుమలరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం5 గంటలకు మొదలయ్యే ఈ సభలో మట్టి పువ్వు పుస్తకాన్ని ప్రఖ్యాత రచయిత ప్రొ.జయధీర్ తిరుమల రావు ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథులు గా తెలంగాణా సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ హాజరుకానున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గండికోట లలిత, తండ్రి: గండికోట పాండురంగ మూర్తి ఇంటి.నెం: 7-48, బ్రాహ్మణబజార్, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా, తెలంగాణ. ది.16.06.2025 నాడు నేను ఖమ్మం నుండి నేలకొండపల్లి బైక్ పై వెళ్తుండగా మధ్య మార్గంలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ (పాస్‌పోర్ట్ నెం. N2117252) పోయినది. ఎంత వెతికిన దొరకలేదు. పాస్‌పోర్ట్ దొరికిన వారు పైన తెలిపిన అడ్రస్‌కు తెలుపగలరు.

గండికోట లలిత సెల్ : 9618786459

పెండింగ్ ధాన్యం బోనస్‌ను చెల్లించాలి

సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్

నేలకొండపల్లి,నవంబరు15(ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించి, కొనుగోలు కేంద్రాలకు అమ్ముకున్న ధాన్యానికి రావాల్సిన పెండింగ్ బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం నేలకొండపల్లి రావెళ్ళభవన్‌లో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్ రూ.500 ఇవ్వకుండా, ఖరీఫ్ సీజన్‌కు తోలిన ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో రచ్చా నర్సింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీరెడ్డి, భూక్యా కృష్ణ, ఏటుకూరి రామారావు, పోతనబోయిన పెరుమాళ్ళు, శీలం అప్పారావు, పొన్నం శివరాజు, సామాల మల్లికార్జున్, పగిడికత్తుల నాగేశ్వరరావు పాలొగన్నారు.

కాంగ్రెస్ నేత నాగిరెడ్డికి నివాళులు

తిరుమలాయపాలెం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోనిపాతర్లపాడు మాజీసర్పంచ్ రామసహాయం వెంకటరెడ్డి తండ్రి నాగిరెడ్డికి శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. దశదినం సందర్భంగా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, మాజీసర్పంచ్ రామసహాయం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా మహా పడిపూజ

కామేపల్లి,నవంబరు15(ఆంధ్రజ్యోతి):'స్వామియే శరణం అయ్యప్పా. శరణం అయ్యప్పా స్వామి శరణం అయ్యప్పా' అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో తాళ్లగూడెం మార్మోగింది. తాళ్లగూడెం గ్రామానికి చెందిన పిప్పళ్ల శ్రీను, యర్రబోయిన ప్రభాకర్ గురుస్వాముల ఆధ్వర్యంలో గ్రామంలో తాండ్ర రాంప్రసాద్ గురుస్వామిచే మహ పడి పూజ, హోమగుండం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు, స్వామిని స్మరిస్తు భజన కీర్తనలతో భక్తిపాటలతో ఆలరించారు. పెద్ద సంఖ్యతో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లగూడెం అయ్యప్ప స్వాముల భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



పలుకుటుంబాలకు కందాళ పరామర్శ

తిరుమలాయపాలెం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శనివారం పర్యటించారు. తెట్టెలపాడుకు చెందిన తోడేటి నాగమణి, వెదుళ్లచెరువకు చెదిన సిరసవాడ నాగమ్మ ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బలరాంతండాకు చెందిన బీఆర్‌ఎస్ నేతద ధరావత్ పంతునాయక్ కుమార్తె మృతిచెందగా ఆమె కుమార్తెకు రూ.30వేలు అందించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఢిల్లీ పర్యటనకు వెళ్లేందుకు రూ.40వేలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న,ఉన్నం బ్రహ్మయ్య, బానోతురవి, ఇస్లావత్ రవి, దేవేందర్‌రెడ్డి,మంచానాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పెన్షనర్స్ దీక్షలు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు వర్కర్స్ అసోసియేషన్ చేపట్టిన నిరాహారదీక్షలు 5వరోజుకూడా కొనసాగాయి. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌గోపీచంద్, కె.నాగేశ్వరరావు మాట్లాడారు. పెన్షనర్లు దాచుకున్న సొమ్ములను సైతం ఇవ్వకుండా వేధిస్తున్న ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ నిరాహారదీక్షలు చేస్తున్నామన్నారు. ధర్నా శిబిరాన్ని యూటీఎఫ్ జిల్లా పూర్వకార్యదర్శి చావా చిట్టెమ్మ, ప్రజ నాట్యమండలి జిల్లా కార్యదర్శి సందానందం, సాహితీవేత్త రౌతు రవి, తదితరులు సందర్శించి సహీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మాధవరావు, రవికుమార్, స్వామి పాల్గొన్నారు.

శ్రీరామ అవధూత మహా సప్తహోత్సవాలు



యాగం చేస్తున్న భక్తులు

వైరా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామంలో శనివారం శ్రీరామ అవదూత శ్రీ రాజ రాజేశ్వరమాతల మందిరంలో 34వ వార్షిక మహా సప్త హోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మందిర నిర్వాహకుడు గుండోజు గోపయ్య ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా పత్యంగిరిదేవి హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

సుహృద్భావ వాతావరణంలో జీవించాలి

» ప్రత్యేక లోక్ అదాలత్‌లో 513 కేసుల పరిష్కారం

» అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



సత్తుపల్లిలో ఇరువర్గాలకు రాజీ కుదుర్చుతున్న న్యాయాధికారి



మధిరలో అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి దీప్తి వేముల

సత్తుపల్లిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకుని సుహృద్భావ వాతావరణంలో జీవించాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ ఆకాంక్షించారు. సత్తుపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతమైంది. అంతకముందు నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులు పెద్ద ఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్లేనని, రాజీమార్గమే రాజమార్గమనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కేసుల పరిష్కారానికి కృషిచేసిన సిబ్బందిని, పోలీసు ఉన్నతాధికారులను ఆయన అభినందించారు. డబ్బు, సమయం ఆదా అవుతుందని, ఎంఎల్ఎస్‌సీ ఆధ్వర్యంలో న్యాయవాదిని ఉచితంగా ఏర్పాటు చేస్తామని, సదవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. పీఎల్‌సీ కేసులు, న్యాయవిజ్ఞాన సదస్సుల నిర్వహణ, పారాలీగల్ వాలంటీర్స్ నియమించడం, ఉచిత న్యాయ సహాయం చేయడం, జైలు అదాలత్‌లు, లోక్ అదాలత్‌లు నిర్వహించడంపై అవగాహన కల్పించారు.

513 కేసులు పరిష్కారం..

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 513కేసులు పరిష్కారమవ్వగా సీనియర్ సివిల్ జడ్జీ కోర్టులో 2, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులో 310, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులో 201కేసులతో పాటు రూ.1.90లక్షల నగదు వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.మీరాఖాసీం సాహెబ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ బీఎస్ఎస్.సుమబాల, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వీ.లావణ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు నల్లగట్ల విజయకుమార్, బొర్రా వెంకట్రావ్, వంకదారు రామకృష్ణ, , కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌కు విశేష స్పందన

మధిర రూరల్: మధిర కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మధిరకోర్టు న్యాయాధికారి దీప్తి వేముల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో వేగంగా విస్తరిస్తున్న సైబర్ నేరాల ప్రమాదాలను గుర్తు చేస్తూ ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు డిజిటల్ భద్రతకు సంబంధించిన మౌలిక జ్ఞానాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, తెలియన నెంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, ఓటీపీ, ఆధారిత మోసాలు, యూపీఐ/బ్యాంకింగ్ మోసాలు వంటి వాటికి దూరంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ జన్ను భద్రయ్య, న్యాయవాదులు బోజెడ్ల పుల్లారావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, డి.జగన్మోహన్‌రావు, కె.రమేష్, విజయ్, జె.రమేష్, సతీష్, రమేష్, సిబ్బంది మాధురి తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎలగొండ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దంపతులు

ముదిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కుటుంబసమేతంగా శనివారం ముదిగొండ మండలం అమ్మపేట ఎలగొండస్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కౌన్సెలింగ్ క్లాసుల ప్రారంభం

మధిర రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ అధ్యయన కేంద్రం నందు ఈ నెల 16 నుంచి ఒకట్రెండు సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని అంబేద్కర్ యూనివర్సిటీ కోర్డినేటర్ శీలం ఇందిరా తెలిపారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థులు కౌన్సిలింగ్ తరగతులకు హాజరు కావాలని కోరారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఆనందరావు

మధిర రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కృషితో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం మధిరలోని రేణుకాచౌదరి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు జవ్వాజి ఆనందరావు, కర్లపూడి అప్పారావు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. నక్కలూరి స్వప్న, వి.వెంకటేశ్వర్లకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దోర్నాల రవి, ఆవుల గురుబ్రహ్మం, జిల్లేపల్లి ప్రసాద్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పిల్లల హక్కులు, విద్యపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీడీపీవో మెహరున్నీసాభేగం

సత్తుపల్లిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అమలు చేయడంతోపాటు పిల్లల హక్కులు, విద్య, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసా భేగం అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా శనివారం సత్తుపల్లిలోని బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు చెడు స్పర్శ, మంచి స్పర్శ, ఆహారం, ఆరోగ్యం, శరీర పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు గంగాజలం, రజిని, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక ఏకాదశి వేడుకలు



ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా కల్లూరులోని తిరువూరు క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో స్వామి వారికి అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అల్లం సంజీవరెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు కోట్ల నందీశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ భక్తులు పొంగులేటి భద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రసాదలింగం, పాలడగు శంకర్‌రావు, మెరుగు కృష్ణయ్య, తుదికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాల' బట్టీలు!

(5వ పేజీ తరువాయి)

రూ.12 వరకు విక్రయించడంతో మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకే జంకుతున్నారు. పెట్టుబడికి మూడింతల లాభాలు గడిస్తున్న వ్యాపారులు.. ఎలాంటి పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో గృహ నిర్మాణం పనులు ఊపందుకోవడంతో.. ఇటుక బట్టీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. బట్టీల ఏర్పాటుపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వందలాది ఇటుకబట్టీలను ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్కదానికి పూర్తిస్థాయి అనుమతులు మాత్రం లేవని తెలుస్తోంది. అలాగే ఇటుక బట్టీల నుంచి వెలువడే కాలుష్యం, బూడిద, దుమ్ముతో బట్టీల సమీపంలో ఉన్న పంట దిగుబడులతో పాటు వాహనదారులపై ప్రభావం చూపుతోందని రైతులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటుక బట్టీలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే బట్టీలకు పంచాయతీ తీర్మానం కూడా తప్పనిసరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ అధికారి అనుమతులు కూడా తీసుకోవాలి. అయితే ఇవేమీ పట్టించుకోకుండానే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో పోటీ పడి మరికొందరు వ్యాపారులు ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి యథేచ్ఛగా కలపను తరలించి ఇటుక బట్టీలను కాల్చుతున్న అధికారులకు పట్టింపు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. విలువైన అటవీ సంపదను ఇటుక బట్టీలకు తరలిస్తూ బూడిద చేస్తున్నారు. అటవీ ప్రాంతం, చెరువులు, కాల్వలకు సమీపంలో బట్టీలను ఏర్పాటు చేస్తూ విలువైన వనరులను కొల్లగొట్టేస్తున్నారు. ఇటుకల తయారీకి అనువైన మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేస్తూ లక్షలాది రూపాయల ఆదాయాన్ని వెనుకేసుకుంటున్నారు. అలాగే రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. కానీ కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అధికారుల కనుసన్నల్లోనే ఉచిత విద్యుత్‌ను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల బాల కార్మికులు కూడా ఇటుక బట్టీలలో కార్మికులుగా మారి పని చేస్తున్నా.. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు పాల్పడుతున్న ఇటుక బట్టీ నిర్వాహకులపై జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతులకు పరిహారం అందించాలి

కల్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌లో తుఫాన్‌ల ప్రభావంతో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నందున పంట నష్ట పోయిన రైతులకు ఆదుకుని ప్రభుత్వం పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండు చేశారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని ధాన్యం కేంద్రాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు బొంతు రాంబాబు, మాదినేని రమేష్‌లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలకు సమగ్ర మద్దతు ధరను ప్రకటించాలని వారు కోరారు. తఫాన్‌ల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పత్తి, పంట తీవ్రంగా నష్టం జరిగిందని అన్నారు. ఒక్కో ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్లకు దిగుబడి వచ్చే పత్తి రెండు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. పండిన ఈ కొద్ది పంటను కూడా సీసీఐ నిబంధనలను మార్చి రైతుల వద్ద ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంత్సరం వరి పంటకి ఇస్తున్న బోనస్ ఇంత వరకు పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. తక్షణ మే ఈ సంత్సరం ఇవ్వాల్సిన బోనస్‌ను రైతులకు అందించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను కల్పిస్తూ, ప్రకృతి వైపరీత్యాలతో నష్ట పోయిన రైతులకు ఇన్సూరెన్స్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, వ్య.కా.స సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

శివాలయంలో లక్షబిల్వార్చన పూజలు



లక్షబిల్వార్చనలో పాల్గొన్న టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా

సత్తుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓం నమశ్శివాయ.. హరహర శంభోశంకర మహదేవా..శివోహం అంటూ భక్తులు నామ స్మరణతో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం మార్మోగిపోయింది. పట్టణంలోని గుడిపాడు శివాలయంలో శనివారం మారేడు దళాలతో లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లి నరసింహారావు, నున్నా రత్నాకర్, కొల్లి వెంకటేశ్వరరావు, పిడుగు సత్యనారాయణ, కాల్నేని రాజేష్, కిరణ్‌బాబు, కూసంపూడి మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

కొణిజర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏ, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్ కోరారు. శనివారం మండల పధిలోని తనికెళ్ల సమీపంలో మైనారిటీ గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన మండల మహాసభలో ఆయనపాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అర్థాంతరంగా మరణించిన ఉపాధ్యాయులకు టీఎస్‌యూటీఎఫ్ సంక్షేమనిధి నుంచి రూ.6లక్షలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 30న కల్లూరులో జరిగే జిల్లా విస్తృతస్థాయి కమిటీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, రవికుమార్, ప్రసాదరావు, సుధాకర్, విజయలక్ష్మి, తిరుపయయ, ప్రసాద్, కోటేశ్వరావు, మురళీకృష్ణ వీరస్వామి పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి

కారేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను తుడుందెబ్బ, ఆదివాసీ సంక్షేమా పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్తీ రాంప్రసాద్, ఈశాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం బాస్కర్ మాడె సత్యానారాయణ, ఈశాల వెంకన్న, వట్టం నాగేశ్వరరావు, యదలపల్లి శ్రీనివాస్, పాండు, బుద్ద వరప్రసాద్, గలిగ జయమ్మ పాల్గొన్నారు.

పుల్లయ్య కుటుంబానికి తుమ్మల పరామర్శ



సత్తుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన గుండు పుల్లయ్య కుటుంబాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి కుమారులు ప్రసాద్, ఉమా, శ్రీనివాసరావులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో మధిర ప్రథమ స్థానం



బహుమతులు సాధించిన విద్యార్థులు

పెనుబల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అండర్-17 బాలుర ఖోఖో పోటీల్లో మధిర మండలం ప్రథమ స్థానం సాధించిందని ఎంఈవో ఎస్.సత్యనారాయణ తెలిపారు. శనివారం వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో అండర్-17విభాగంలో బాలుర ఖోఖో పోటీలను తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లాలోని 22మండలాలకు చెందిన 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వారి వారి స్థానాల్లో ప్రతిభ కనబర్చి మధిర మండలం ప్రథమ స్థానాన్ని, తిరుమలాయపాలెం ద్వితీయ స్థానాన్ని, ఖమ్మం సౌత్ జట్టు తృతీయ స్థానం, బోనకల్ విద్యార్థులు నాల్గో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం స్కూల్ గేమ్స్ పెడరేషన్ సెక్రటరీ యాసా రామారావు, జాయింట్ సెక్రటరీ చిన్ని, ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ వీరరాఘవయ్య, ప్రధానపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఇబ్బందిపడొద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో

కొణిజర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా పారదర్శకంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డీఎస్‌వో చందన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండలంలోని కొణిజర్ల, మల్లుపల్లి గ్రామాల్లో పర్యటించి రేషన్ దుకాణాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి కాంటాలు వేయాలని తెలిపారు కొణిజర్ల రైస్‌మిల్లును తనిఖీచేసిన ఆయన సీఎంఆర్ రైస్‌వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లుపల్లిలోనే ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కొణిజర్లలోని రేషన్ దుకాణం పరిశీలించి రికార్డుల ప్రకారం రైస్‌ను అందించారా లేదా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

» పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న అధ్యక్షుడు శేఖర్‌రావు

మధిర రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు, పీఆర్సీపై ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మధిరలో పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలు చెల్లించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా అమలుచేయకపోవడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు చెల్లించకపోవడం, ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం గడిచినా కూడా బెనిఫిట్స్ చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ పనిచేస్తుందన్నారు. నాయకులు ఆర్.రంగారావు, ఆర్.బ్రహ్మారెడ్డి, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, సుధాకర్, మదన్ మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సంగారావు, జ్యోతి, పి.నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యావేత్త అనంతరామయ్య కన్నుమూత

కల్లూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడైన ధన్యాల అనంతరామయ్య(95) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. 38 సంత్సరాల క్రితం కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటుగా పలు ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేసిన కాలంలో అనంతరామయ్య ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందించారు. నాటి పూర్వ విద్యార్థులు ఆయన నివాసానికి తరలి వచ్చి మృతదేహానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. చెరుకూరి రాజేశ్వరరావు, తోటకూర శేషగిరిరావు, కట్టా అజయ్‌కుమార్, విశ్రాంత ఏఎస్ఐ కుమ్మరి రామారావు, వడ్లమూడి కృష్ణమూర్తి, కృష్ణమోహన్, చలమల సత్యనారాయణ, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణ పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మల జన్మదిన వేడుకలు



కల్లూరులో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



వైరాలో..



తల్లాడలో..

కల్లూరు/తల్లాడ/వైరా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను కల్లూరులో శనివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టిటిడి మండపంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా టిటిడి మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర నేత్ర వైద్యాలయం (తిరువూరు) వారిచే సుమారు 250 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 75 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజదేవి, ప్రభాకరచౌదరి, కొండపల్లి శ్రీమన్నారాయణ, మాదిరాజు అన్నమరాజు, తోటకూర శేషగిరి రావు, కుంచాల గురవయ్య, బాలనాగేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ మహిళ విభాగం రాష్ట్ర నాయకురాలు రుక్మిణీ యాదవ్ పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన సదస్సు



మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి అరుణదేవి

ముదిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణాదేవి మధుమేహ వ్యాధి వల్ల వచ్చేసమస్యల గురించి వివరించారు. మధుమేహ వ్యాధి సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యాధికారిణి నస్రీన్ వైద్య సిబ్బంది మధుసూదన్, రామారావు, కుమారి, శారదా, లత తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో మధుమేహ వ్యాధి నివారణ

తల్లాడ: శరీర బరువును నియంత్రించుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల మధుమేహ వ్యాధిని నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ మౌనిక తెలిపారు ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినోత్సవం స ందర్భంగా శనివారం తల్లాడలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెగ్యులర్ రక్తపరీక్షలు చేయించుకోవాలని, ఎప్పుడు పడితే అప్పుడు ఉపవాసాలు ఉండకుండా మానివేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీరోజు ఉదయం కొంత దూరం నడవడం ద్వారా అనారోగ్య సమస్యలు ఏర్పడవని, రోజూ వ్యాయమం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, రూ స్నేలక్ష్మి, భద్రమ్మ, కళావతి, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.